క్లుప్తంగా

మునిసిపల్ వర్కర్స్ సమావేశం

కృష్ణలంక(విజయవాడతూర్పు): దశాబ్దాల నుంచి మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్, ఎన్ఎంఆర్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఫెడరేషన్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులు ఎవ్వరూ చేయలేని విధులు నిర్వహిస్తున్నారని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కితాబు ఇచ్చారన్నారు. వారి శ్రమను ఎవరూ గుర్తించడం లేదన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం, ఉపాధ్యక్షులు నాయుడు, నూకరాజు, కార్యదర్శులు ముత్యాలరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శుక్రవారం మాచవరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ. 30 వేల విలువైన ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మికి అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలకు 15 సీలింగ్ ఫ్యాన్లు, 20 ట్యూబ్‌లైట్లు అందజేయటం అభినందనీయమన్నారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు సుబ్బారావు, నాగరాజు, పీఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులుగా కాలేజీ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది అధ్యాపకులు పాల్గొన్నారు.

కేబీఎన్ విద్యార్థినికి అభినందన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల విద్యార్థిని జ్యోతిమల్లిక ఏపీ ఉన్నత విద్యామండలి ప్రకటించిన ఎక్స్‌లెన్స్ అవార్డును గెలుచుకొని రూ. లక్ష నగదు బహుమతిని కైవసం చేసుకుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. కమ్యూనిటీ సర్వీస్ విభాగంలో మొదటి బహుమతిని అందుకున్నామని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతిని తమ విద్యార్థి అందుకుందని వివరించారు. కళాశాల కమిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జ్యోతిమల్లికను కళాశాల మాతృసంస్థ ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షులు చిట్టూరి ఆనందసుధాకర్, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసులు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి అన్నం రామకృష్ణారావు, పొట్టిశ్రీరాములు కళాశాల కోశాధికారి కొత్త మాసు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వారాహిదేవికి ప్రత్యేక పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని లలితాంబికా పీఠంలో వారాహిదేవి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజు శుక్రవారం బృహత్ వారాహిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం జరిగింది. అమ్మవారికి పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పూజలు నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

యువకుడి అసభ్య ప్రవర్తనపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ టైలర్‌పేటకు చెందిన ఓ బాలిక చిట్టినగర్‌లోని ఓ ప్రయివేటు స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. 22వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బయటకు వెళ్లి ఇంటికి వస్తోంది. అదే సమయంలో ఇంటి యజమాని కుమారుడు రమణారావు బాలిక వెనుక నుంచి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. రమణారావు పారిపోవడంతో బాలిక విషయాన్ని తల్లికి చెప్పింది. దీంతో ఘటనపై తండ్రి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష

- ప్రజలకు చేరువలో 11 రకాల సర్వీసులు
- నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించాలి
- మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమమని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్హులై ఉండి ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్న తపన, తాపత్రయంతో ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జగనన్న సురక్ష' అని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ సర్కిల్–2 పరిధిలోని 26వ డివిజన్ మారుతీనగర్ మసీదు వీధిలోని 28, 29, 30, 31 వార్డ్ సచివాలయాల్లో శుక్రవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి సంబంధించి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శనివారం నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. నాలుగు వారాలపాటు నిర్వహించనున్న క్యాంప్‌లో ఎలాంటి ఫీజు లేకుండా అర్హులకు సర్టిఫికెట్లు అందజేయాలన్నది ప్రభుత్వం ఉద్దేశమన్నారు. శిక్షణ కార్యక్రమంలో కమిషనర్ ఏమన్నారంటే...



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- 'జగనన్న సురక్ష' కార్యక్రమం జూలై 1వ తేదీ నుంచి జరగనుంది
- నేటి నుంచి వలంటీర్లు 'జగనన్న సురక్ష' యాప్‌లో ఇంటింటి సర్వే ప్రారంభించాలి
- ప్రతి వలంటీర్ తప్పకుండా ప్రతి ఇంటి వద్ద కనీసం 10 నిముషాలు గడిపి గుణాత్మక సర్వే చేయాలి
- యాప్‌లో ఇచ్చిన ప్రశ్నపత్రాన్ని వలంటీర్ చదివి ప్రోగ్రామ్ రోజున జారీ చేయాల్సిన సర్టిఫికెట్లపై అవగాహన కల్పించాలి.
- ఎవరికైనా ఏదైనా సర్టిఫికెట్ అవసరమైతే సమర్పించాల్సిన సహాయక పత్రాల గురించి తెలియ చేయాలి.
- ప్రోగ్రామ్ రోజున వలంటీర్ తప్పనిసరిగా పౌరులతోపాటు వెళ్లి అవసరమైన సర్టిఫికెట్ పొందడంలో సాయం చేయాలి.

ప్రజలకు అత్యంత చేరువలో 11 రకాల సేవలు

'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా 11 రకాల సర్వీసులను సులభంగా, ఉచితంగా తీసుకోవడానికి ప్రభుత్వం ప్రజలకు అత్యంత చేరువలోకి తీసుకువచ్చింది. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ అనుసంధానం, పంట సాగు, పంట సాగు హక్కు కార్డ్(సీసీఆర్‌సీ), రైస్ కార్డ్ షిఫ్టింగ్ ఈ క్యాంప్‌లలో ఉచితంగా అందజేస్తారన్నారు. వినతుల స్వీకరణ, రిజిస్ట్రేషన్లు, వెరిఫికేషన్, సర్వీస్ రిక్వెస్ట్‌లకు వేర్వేరు డెస్క్‌లను ఏర్పాటు చేస్తామని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలియ చేశారు.

కార్యక్రమంలో జోనల్ కమిషనర్ జీ సృజన, ప్రత్యేక అధికారి (ఎస్ఎమ్ఓ) డాక్టర్ బాబు శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సేవల్లో లోపాలుంటే చర్యలు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పారిశుద్ధ్య సేవల్లో లోపాలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం సర్కిల్–3 పరిధిలోని 14వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో చెత్త తొలగింపులో సిబ్బంది అలసత్వాన్ని గుర్తించారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు ఎన్నో పాలనా సంస్కరణలు అమలు చేస్తున్నా కొంతమంది దిగువ స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌నగర్ సచివాలయ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనులపై అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోజూ మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కాలువల్లో పూడిక తీయాలని శానిటరీ మేస్త్రికి ఆదేశాలిచ్చారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని స్పష్టం చేశారు. సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క ఇంటి నుంచి వచ్చే చెత్తను తప్పనిసరిగా వారి వద్దకు వస్తున్న క్లాప్ ఆటోకి అందించాలని చెప్పారు. రోడ్లు, కాలువలను శుభ్రం చేయాలన్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తూ ప్రజల్లో శానిటేషన్ గురించి అవగాహన కల్పించటం ద్వారా ఈ క్లాప్ యూజర్ చార్జీల వసూళ్లలో పురోగతిని సాధించవచ్చని తెలిపారు.



పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పూడికతీత పనులు ముగించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వర్షాలు పూర్తిస్థాయిలో పడటానికి ముందే పూడికతీత పనులు ముగించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. తన నగర పర్యటనలో భాగంగా శుక్రవారం ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులతో కలిసి బెంజిసర్కిల్ సమీపంలోని రిలయన్స్ ట్రెండ్జ్ ముందు జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. రోడ్డు అంచున ఉన్న మట్టి వర్షం నీటి ద్వారా డ్రెయిన్లలోకి వెళ్లి అవి బ్లాక్ అవుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. వానాకాలం దృష్ట్యా మురుగునీరు సక్రమంగా పారడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ నగరంలో ఇప్పటి వరకు జరిగిన పూడికతీత పనుల శాతం, పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో తీసుకోవల్సిన చర్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే సంబంధిత అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పిజరత్నావళి, ఏడీహెచ్ శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.చంద్రశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరీముల్లా, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మట్టిని తొలగించడాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

1 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జూలై 1వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం శిక్షణ విభాగం కన్వీనర్ యు.వి.రామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాలీ ఇన్ అడ్వాన్స్, ట్యాలీ ఇన్ జీఎస్టీ, ఎంఎస్ ఆఫీస్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, పవర్ బీఐ, ఇంటర్‌నెట్ కాన్సెప్ట్స్, సీ లాంగ్వేజ్, పైథాన్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30వ తేదీలోపు 0866 2578044లో సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి చెప్పారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యాన శుక్రవారం అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఆరోగ్యం ఏర్పడుతుందని వివరించారు. చీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్, ఫుట్‌బాల్ కోచ్ ఎండీ సిరాజుద్దీన్ , కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వి. శ్రీనివాసరావు, డాక్టర్ రాజ్యలక్ష్మి క్రీడల ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం కార్ల్‌మార్క్స్ రోడ్డులో అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమాలను వ్యాయామ విద్యా విభాగ అధిపతి డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ యుగంధర్ పర్యవేక్షించారు.

శిశువుకు రక్తదానం

అవగాహన ర్యాలీ సమయంలో తలసీమియా వ్యాధితో బాధపడుతున్న నాలుగేళ్ల చిన్నారికి రక్తం కావాలని వచ్చి అడిగారు. దీంతో కళాశాల విద్యార్థి నయాబ్ రసూల్ రక్తదానం చేశారు. దీంతో కళాశాల సిబ్బంది అతన్ని సత్కరించారు. ఏజీ కార్యాలయంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్‌తో పాటు ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహించిన విద్యార్థులు పి. మౌనిక, శ్రుతిని సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఒలింపిక్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ

మహా మండపం వద్ద స్థల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి మహామండపం వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన చేశారు. శుక్రవారం ఆలయ పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, ఇంజినీరింగ్ అధికారులు డీఈ రవీంద్ర, ఏఈ రాజులు మహామండపం పరిసరాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా మరుగుదొడ్లను నిర్మించాలని రాంబాబు ఆలయ అధికారులకు సూచించారు. మహా మండపం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వర్షాకాలం నేపథ్యంలో వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. స్థల పరిశీలన పూర్తయిన తర్వాత మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న పాలక మండలి సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులు

నేత్రపర్వం.. నృత్య ప్రదర్శన





ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం కళాకారులు దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు. –ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

'పది' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- ఎన్టీఆర్ జిల్లాలో 57 శాతం ఉత్తీర్ణత
- కృష్ణా జిల్లాలో 40.56 శాతం పాస్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు 57 శాతం ఉత్తీర్ణతను సాధించగా, కృష్ణాజిల్లాలో 40.56 శాతం ఉత్తీర్ణులయ్యారు. మార్చి మాసంలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు విద్యాశాఖ ఈ నెల రెండో తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను చేపట్టింది. ఈ నెల పదో తేదీ వరకూ పరీక్షలు కొనసాగాయి. అనంతరం 13, 14 తేదీల్లో పరీక్ష పత్రాల వాల్యూయేషన్‌ను నిర్వహించారు. పరీక్ష ఫలితాలను శనివారం ఉన్నత విద్యాశాఖ ప్రకటించింది. అందులో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 8,477 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో బాలురు 4,813 మంది ఉండగా, బాలికలు 3,664 మంది ఉన్నారు. పరీక్ష రాసిన వారిలో 4,832 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 2,579 మంది బాలురు, 2,253 మంది బాలికలు ఉన్నారు. ఉత్తీర్ణత 57 శాతంగా ఉంది. బాలురు ఉతీర్ణత శాతం 53.58 ఉండగా, బాలికల ఉతీర్ణత శాతం 61.49గా ఉంది. అదేవిధంగా కృష్ణాజిల్లాకు సంబంధించి 5,880 మంది హాజరవ్వగా అందులో 3,626 మంది బాలురు, 2,254 మంది బాలికలు ఉన్నారు. ఉత్తీర్ణులైన వారు 2,385 మంది ఉండగా అందులో బాలురు 1,346 మంది, బాలికలు 1,039 మంది ఉన్నారు. ఉతీర్ణత శాతం 40.56గా ఉంది. 37.12 శాతం బాలురు, 46.10 శాతం బాలికలు ఉత్తీర్ణులయ్యారు.

రీకౌంటింగ్‌కు 29 వరకూ గడువు..

ఈ నెల 29వ తేదీ లోపు విద్యార్థులు రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కొక్క సబ్జెక్ట్‌కు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాశాఖ ప్రకటించింది. అదే విధంగా విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఇబ్బందులు లేకుండా నాలుగు రోజుల్లో విద్యార్థుల మార్కుల జాబితాలను వెబ్‌సైట్‌లో ఉంచనున్నారు. అలాగే త్వరలోనే విద్యార్థులు ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లను పాఠశాలలకు పంపించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

ఆటలతో ఆరోగ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): ఆటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీశారద కరాటే స్కూల్ కోచ్ బల్లం కిషోర్ ఆధ్వర్యాన శుక్రవారం శాంతినగర్లో కోచ్‌లు, క్రీడాకారులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ నాయకులు పి.రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నేతలు అన్నపురెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్ల మబ్బు కమ్ముకొనగా.. చినుకు కుమ్మరించగా..





ఆకాశంలో మబ్బుల ముసుగు..పర్యావరణం.. చల్లని వాతావరణం.. మొన్నటి వరకు ఎండలతో అవస్థలు పడిన ప్రజానీకానికి వాన జల్లులు కురిసిన వేళ ఆహ్లాదకరంగా మారిన దృశ్యం శుక్రవారం రాత్రి నగరంలో వన్‌టౌన్‌లో సాక్షాత్కరించింది. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పొట్టి శ్రీరాములు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రూపకుమారి అన్నారు. కృష్ణలంకలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన శుక్రవారం అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించారు.

పాఠశాల మైదానంలో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో చైల్డ్ సేఫ్టీ నెట్ కో ఆర్డినేటర్ సీహెచ్ సుకన్య, ప్రోగ్రాం మేనేజర్ రాఘవకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పదును పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ప్రతిభకు పదును పెట్టినప్పుడే మరిన్ని విజయాలను సొంతం చేసుకుంటారని కొత్తపేట హిందూహైస్కూల్ కమిటీ కార్యదర్శి కేఎల్వీ మోహనరావు అన్నారు. ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్‌లో శుక్రవారం 2022–23 విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు సత్కారం చేశారు.

ఎస్ అశోక్‌కుమార్(572), ఆదిత్యదుర్గాప్రసాద్(570), ఎంవైవీ మార్కండేయ మణికంఠ (562), యశ్వంత్(557)లకు మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేయడంతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులను అందించారు. కేఎల్వీ మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు పేరుతో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించటం శుభపరిణామమన్నారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ మిల్క్‌ప్రాజెక్ట్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సయ్యద్ అప్పలస్వామి కాలేజీ వెనుక కొండ ప్రాంతం, వీజీఎస్ పబ్లిషర్స్ ఏరియా, రాజీవ్ శర్మ నగర్, లంబాడీపేట, సాయిరాం సినిమా హాల్ ఏరియా, కలరా హాస్పటల్ కొండ ప్రాంతం, కుండల మార్కెట్ ప్రాంతం, సౌమ్య థియేటర్ ప్రాంతంలో కరెంట్ ఉండదని వివరించారు.

భవానీపురం సబ్ స్టేషన్ పరిధిలో

భవానీపురం పరిధిలోని 33/11 కేవీ భవానీపురం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు క్రాంబ్వే (స్వాతి) రోడ్, సభాపతి రోడ్, అరుణకుమారి వీధి, బాజీ బాబా మందిరం వీధి, ఆశ్రమం వీధి, అవుట్ ఏజెన్సీ ఏరియా, దర్గా ఏరియా, వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్, ఓల్డ్ ఎంఐజీ, వెలంపల్లికాలనీ, టీచర్స్‌కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, హెచ్ఐజీలు, ఎమ్ఐజీ 1–2, ఐరన్ యార్డ్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలకు 'డీడీఎన్' వర్తింపుపై హర్షం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలకు ధూపదీప నైవేద్య (డీడీఎన్) పథకాన్ని వర్తింపజేస్తూ రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ ఉత్తర్వులు జారీచేయడంపట్ల ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ గొల్లపూడిలోని దేవదాయశాఖ కార్యాలయంలో కమిషనర్ ఎస్.సత్యనారాయణ నుంచి శుక్రవారం శ్రీకాంత్ ఉత్తర్వుల కాపీని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం వర్తింపజేయాలన్న తమ అభ్యర్థన మేరకు జీవో నంబర్ 665 ప్రకారం అన్ని జిల్లాల్లోని దేవదాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారని తెలిపారు.

విశ్వబ్రాహ్మణుల విజ్ఞప్తికి స్పందించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు, బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

శ్రీదేవి కరుమారి అమ్మన్‌కు ఆషాఢ సారె

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నైనవరం ఫ్లై ఓవర్ సమీపంలోని శ్రీదేవి కరుమారి అమ్మన్‌కు శ్రీ మాతృ మండలి వ్యవస్థాపకురాలు కోడూరి సుందరి బృందం ఆషాఢ సారెను శుక్రవారం సమర్పించింది. కోడూరి సుందరి బృందానికి పీఠాధిపతి కరుణ దాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించి, ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారి సన్నిధిలో వారాహి నవరాత్రులను వైభవంగా నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి కరుణ దాసు పేర్కొన్నారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, రాఘవరావు శర్మ, జయంతి, బందారు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సారెను సమర్పిస్తున్న భక్తులు

భర్త, అత్తపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్‌కు చెందిన షేక్ సుహానా గుణదలకు చెందిన బసవ వంశీని 2021లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సుహానా బ్యూటీ పార్లర్‌లో పని చేస్తుండగా, వంశీ ఫ్లిప్‌కార్ట్‌లో పని చేస్తుంటాడు. కొంత కాలంగా వంశీ తల్లి బసవ ఝాన్సీ కోడలిని కట్నం తీసుకురావాలని వేధిస్తోంది. దీంతో వంశీ భార్య సుహానాను వదిలి, తల్లి వద్దకు వచ్చేశాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి చేరి భర్త, అత్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.